# ముష్టికోసం

రచన :
కుచ్చు సుబ్రహ్మణ్యం

అతనొక బికారి. ముష్టికోసం బైలుదేరాడు. మిట్టమధ్యాహ్న మవడంవల్ల పైన తల, కింద కాళ్ళు భగభగ మండుతున్నాయి. గుండెలు మెండి, ప్రజ్వలిస్తూన్న సూర్యకిరణాలకు ఆగలేమన్నట్టుగా తీవ్రంగా కొట్టుకుంటున్నాయి. పాలిపోయిన అతని మొహంలో దీనత్వం ఎలాంటి రాతి హృదయాన్నైనా కరిగిస్తుంది. అతని బట్టలకి పెద్ద చిల్లులుపడి మర్మం కనిపిస్తూవుంటే—బడికెళ్లే కుఱ్ఱాళ్లు నవ్వుతూ హేళన చేస్తున్నారు.

ఇళ్ళన్నీ తిరిగాడు. రెండు గంటలు 'టంగ్ టంగ్' మంటూ కొడుతూంటే—అతడి హృదయంలో చెప్పలేని బాధ!

పాపం! నేరస్థుడిలాగు తప్పటడుగులు వేస్తూ ఓయింటిని సమీపించాడు. ఆ ఇంటి చావిడిలో యెదుర్గా ఈజీచైరుపై పడుకొని పత్రిక చదువుకొంటూండే కర్కశవిగ్రహం యితనిపాలిటి కాలయముడైంది.

సందేహం... వెనుదిర్గి వెళ్లామని నిశ్చయించి... ఐనా ఆకలికి ఓర్వలేక ప్రయత్నం చేద్దామని, యెడతెగక ఏకధారగా కారుతుండే చెమట బిందువుల్ని యెడమచేత్తో తుడుచుకుంటూ, సత్తువలేని చేయెత్తి అతిదీనంగా—

"బాబయ్యా!...వక్క కానీ—" అని యాచించాడు. ఉగ్రుడై వురిమిచూసి-

"ఫో!—" అని గర్జించాడు ఆ కఠినాత్ముడూ.

"స్వామీ! కరుణించండి. మీపేరు తలుచుకుంటూ. ఆకలికి తాళ్ళేకపోతున్నా"

అని వణుకుతో వేడుకున్నాడా దీనుడు.

ఆ రాతిహృదయం ఆ అనాధుని దీన వాక్యాలకు కనికరించలేదు. అది వజ్ర హృదయం అయింది. చప్పున లేచి, చదువుతూన్న పత్రికతీసి మొహానకొట్టి, వాడది తీసి, అందివ్వబోతుండగా —బూతులతో పాదరక్ష ప్రయోగించాడు.

ముష్టికోసం యాచించిన ఆ అనాధుడు మొదలునరికిన స్తంభంలాగు కింద పడిపోయాడు.

ఇంటి యజమాని కోపం యెక్కువయింది. తన నౌకర్‌ని పిల్చి, తన వాకిట్లోంచి అవతలకి నెట్టించాడు. పాపం! ఆ బికారిహృదయం యెంత తపించిందో ఆ కర్కశుడు విచారించలేదు.

ఈలాంటి అనాధచరిత్ర లింకెన్ని పేరులేకుండా సమసిపోతున్నాయో!

ఈ బికారి సంఘానికిక మోక్షం లేదేమో!!